క్లుప్తంగా

రేపు పట్టణంలో నీటి సరఫరా నిలిపివేత

తెనాలిఅర్బన్: రక్షిత మంచి నీటి పైపులైన్ మరమ్మతుల కారణంగా గురువారం తెనాలి పట్టణంలో నీటి సరఫరా నిలిపివేస్తున్న మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం నీటి సరఫరా పునఃరుద్ధరిస్తామని చెప్పారు. పట్టణంలోని ప్రజలందరూ సహకరించాలని కోరారు.

ముస్లింల సమాధుల తోటలను శుభ్రం చేయించండి



తెనాలిఅర్బన్: రంజాన్ పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో పట్టణంలోని ఈద్గాలలో ఉన్న ముస్లింల సమాధుల తోటలను శుభ్రం చేయించాలని తెనాలి పట్టణ ఈద్గా కమిటీ అధ్యక్షుడు సయ్యద్ గౌస్, ఉపాధ్యక్షుడు షేక్ జానీలు కోరారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ బండి శేషన్న మంగళవారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. దీనిపై స్పందించిన కమిషనర్ సమాధుల తోటలను శుభ్రం చేయించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఈద్గా కమిటీ కార్యదర్శి షేక్ సలీమ్, నాయకులు షేక్ అన్సారీ, షేక్ బాబు, షేక్ నబీ, షేక్ సైదా, తదితరులు పాల్గొన్నారు.

చలపతిలో 'భరతనాట్యం' యూనిట్ సందడి



మోతడక(తాడికొండ): మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం భరతనాట్యం సినిమా యూనిట్ సందడి చేశారు. మూవీ ప్రమోషన్‌లో భాగంగా కళాశాల విచ్చేసిన సినిమా హీరో సూర్యతేజ, హీరోయిన్ మీనాక్షి గౌతమిలు కొన్ని సినిమా పాటలకు ఆడిటోరియంలో కొన్ని పాటలకు విద్యార్థులతో కలిసి డాన్స్ చేసి అలరించారు. కొన్ని ముఖ్య సన్నివేశాలను అనుకరిస్తూ విద్యార్థులతో మమేకమవడంతో సందడి వాతావరణం నెలకొంది. కార్యక్రమాలో దర్శకుడు కేవీఆర్ మహేంద్ర, నిర్మాత పాయల్ సరాఫ్, తారాగణం పాల్గొని విద్యార్థులతో ముఖాముఖీ నిర్వహించి పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. వచ్చే నెల 5న విడుదల కానున్న సినిమాను ఆదరించి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.కిరణ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నాగ శ్రీనివాసరావు వివిధ విభాగాధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తనిఖీల్లో రూ.99వేలు స్వాధీనం

మేడికొండూరు: మండల పరిధిలోని కొర్రపాడు చెక్‌పోస్టు వద్ద అనధికారికంగా తరలిస్తున్న రూ. 99వేలు నగదును మండల తహసీల్దార్ రాజ్యలక్ష్మి, మేడికొండూరు పోలీసులు తనిఖీల్లో పట్టుకున్నారు. తహసీల్దారు రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల్లో భాగంగా మేడికొండూరు మండలంలో వాహనాలు తనిఖీలు జరుగుతున్నాయన్నారు. అధిక మొత్తంలో నగదు తరలిస్తే అలాంటివారిపై చర్యలు తీసుకుంటామన్నారు. రూ.50వేల కంటే ఎక్కువ నగదు తరలించాలంటే సంబంధిత అధికారుల వద్ద అనుమతులు తీసుకోవాలని రాజ్యలక్ష్మి తెలిపారు. పట్టుబడిన నగదును అధికారులకు అప్పజెప్పారు.

492 మందికి ఆరోగ్య పరీక్షలు

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు గ్రామంలో మంగళవారం ఆరోగ్యసురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. 492 మందికి వైద్య పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు. ఈసందర్భంగా ఫిరంగిపురం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.ఎస్తేరురాణి మాట్లాడుతూ 45 మందికి కంటి పరీక్షలు నిర్వహించామన్నారు. ఒకరిని మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వ వైద్యశాలకు రిఫర్ చేసినట్లు తెలిపారు. శిబిరంలో గైనికాలజిస్టు సంధ్య, శ్వేత, జనరల్ వైద్యుడు ప్రసాద్, సీహెచ్‌ఓ వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరీ, కార్యదర్శులు ఏకేబాబు, బి.మధు, ఎంఎల్‌హెచ్‌పీలు స్వప్న, స్పందన, అనూష, ఏఎన్ఎంలు ఎ.ఆంథోనిరాణి, జ్యోతి, అరుణ, ఎంపీహెచ్ఎలు బాబురావు, బాబావలి, విజయ్‌కుమార్, ఆశా కార్యకర్తలు జోజమ్మ, పద్మ, శాంతరాణి, శాంతకుమారి, జాన్‌బీ, మస్తానమ్మ బాయి, నజురున్నీసాలు పాల్గొన్నారు.

తులసీ సీడ్స్‌లో విత్తనాల తనిఖీ

ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్ శివారులోని తులసీ సీడ్స్ విత్తన కర్మాగారాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయ ఏడీఏ మధులేటి సోమవారం తనిఖీ చేశారు. శుద్ధిచేసిన విత్తనాలను హెచ్‌టీ పరీక్ష (హెర్బిసైడ్ టోలరెంట్)చేశారు. అనంతరం రికార్డులు పరిశీలించి మాట్లాడుతూ రైతుల నుంచి తీసుకున్న విత్తనాలకు సంబంధించి అగ్రిమెంటు తప్పనిసరిగా ఉండాలన్నారు. అంతేకాక నాణ్యమైన విత్తనాలకు, తాలు విత్తనాలకు సంబంధించి వేరువేరుగా రికార్డులు ఉండేలా చూడాలని చెప్పారు. నిల్వ ఉన్న స్టాకు రిజిస్టర్లు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఏఓలు సురేష్‌రెడ్డి, వాసంతి, విస్తరణాధికారి సుభాని, హకీమ్‌లు ఉన్నారు.

యువత ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ అనూష

అసిస్టెంట్ కమిషనర్ కె.అనూష

తెనాలిఅర్బన్: దేశ భవిష్యత్ యువత చేతుల్లో ఉందని, యువతి యువకులందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ కె.అనూష సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో మంగళవారం ఓటు వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతనంగా ఓటు హక్కు పొందిన వారు ఓటు హక్కును ఉపయోగించుకోవాలని సూచించారు. మే 13న జరిగే ఎన్నికల్లో అందరూ స్వచ్ఛందంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏసీపీలు సుధాకర్, ఎస్ఎల్ సుబ్బారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఎ.రామచంద్రరావు, బి.శ్రీనివాసరావు, వై.అనుపమ, కళాశాల ప్రిన్సిపాల్స్ వి.తిరుపతిరావు, ఎస్.సునీల్‌కుమార్, సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

నూతన కమిటీల అధ్యక్షులు పార్టీ విజయానికి కృషి చేయాలి

ఎమ్మెల్యే శివకుమార్‌ను కలిసిన ఎస్సీ సెల్ అధ్యక్షుడు అనిల్, బీసీ సెల్ అధ్యక్షుడు శ్రీరామ్



బీసీ సెల్ అధ్యక్షుడు శ్రీరామ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్, బీసీ నాయకులు



ఎమ్మెల్యే శివకుమార్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు అనిల్‌ను అభినందిస్తున్న ఎస్సీ నాయకులు

తెనాలిటౌన్: వైఎస్సార్‌సీపీ తెనాలి మండల ఎస్సీ సెల్ అధ్యక్షునిగా నియమితులైన రూరల్ మండలం కొలకలూరు గ్రామానికి చెందిన పినపాటి అనిల్‌కుమార్, మండల బీసీ సెల్ అధ్యక్షునిగా నియమితులైన సోమసుందరపాలెం గ్రామానికి చెందిన లుక్కా శ్రీరామ్‌లు మంగళవారం గంగానమ్మ పేటలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే శివకుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. తమకు పదవులు రావడానికి సహకరించినందుకు ఎమ్మెల్యే శివకుమార్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ సెల్ అధ్యక్షులు పినపాటి అనిల్, బీసీ సెల్ అధ్యక్షులు లుక్కా శ్రీరామ్‌లను ఆయా విభాగాల నాయకులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ మే నెల 13న జరిగే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి నూతనంగా నియమితులైన వివిధ విభాగాల అధ్యక్షులు కృషి చేయాలని కోరారు. గ్రామాల్లో పర్యటించి పార్టీ అభివృద్ధికి తోడ్పాలని తెలిపారు. ఎస్సీ సెల్ అధ్యక్షుడు అనిల్‌ను అభినందించిన వారిలో మున్సిపల్ వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి, పార్టీ నాయకులు కాకి దేవసహాయం, కొమ్ము రాయల్, గొరికపూడి బాలరాజు, మన్నవ ప్రభాకర్, వేముల మహేష్, అత్తోట చంటి, అక్కిదాసు కిరణ్, అనిల్ కనపర్తి, తదితరులు ఉన్నారు. బీసీ సెల్ అధ్యక్షుడు లుక్కా శ్రీరామ్‌ను అభినందించిన వారిలో ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, పేరం శ్రీను, ఎం.భాను, దుర్గ, శ్రీహరి, మహేష్, పేరయ్య, రాంబాబు, అద్దంకి కోటేశ్వరరావు, కాశీరెడ్డి, ధర్మరాజుల శ్రీనివాసరావు, ఉమర్, బాలు, నాని, శాంతి బాబు, వి.శ్రీను, ఎం.పోతురాజు, తదితరులు ఉన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీ విద్యార్థులకు జాతీయస్థాయి బహుమతులు



అవార్డు పొందిన విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

గుంటూరు రూరల్: ఏఐ టెక్నాలజీ సాయంతో సరికొత్త మార్గం చూపడంలో తమ కళాశాల విద్యార్థులు కనబరిచిన ప్రతిభకు జాతీయస్థాయిలో అవార్డు రావడం గర్వకారణమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో విద్యార్థుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల చిత్తూరులోని శ్రీ సిటీలో నిర్వహించిన నేషనల్ లెవెల్ హ్యాకథాన్ ప్రొటో టైప్ కంపిటేషన్‌లో ఎన్వీ నీహార్ చౌదరి, జోసెఫ్ ప్రేమ్ నేత్ర దర్శన్ అనే ప్రదర్శనకు ప్రథమ స్థానం లభించటంతోపాటు రూ.25 వేలు నగదు పురస్కారాన్ని అందుకున్నట్లు తెలిపారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ తమ కళాశాలలో అందిస్తున్న నాణ్యమైన విద్యా బోధనకు, పరిశోధనల ప్రోత్సాహకానికి నిదర్శనమని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ అంధత్వ సమస్యను పరిష్కరించటానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా అవార్డు పొందిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ జి.రామమోహన్‌బాబు, డాక్టర్ ఎంపీపీ చంద్రశేఖర్ అభినందించారు.

నృసింహ మాలధారుల ఇరుముడులు



మంగళగిరి: పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ మాల ధరించిన స్వాములు మంగళవారం ఇరుముడులతో మాల విరమణ చేశారు. స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి మాల ధరించిన భక్తులు ఇరుముడులతో స్వామి వారిని దర్శించుకుని సాయంత్రం గిరిప్రదక్షిణ అనంతరం ఆలయంలో ఇరుముడులను స్వామి వారికి సమర్పించారు.

తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి



మంగళగిరి: రానున్న మూడు నెలల్లో ప్రత్యేక యాక్షన్ ప్లాన్‌తో తాగునీటి సమస్య రాకుండా అప్రమత్తంగా వుండాలని ఎంటీఎంసీ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ తెలిపారు. మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం తాగునీటి సరఫరాపై ఆయా శాఖల అధికారులు, సచివాలయాల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తాగునీటి సరఫరాపై సచివాలయాల సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించి ఆయా పరిధులలోని తాగునీటి సరఫరా, నీటి కుళాయిలు, చేతిపంపులు పనిచేస్తున్నాయా లేదా అని నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పైపులైన్లు మరమ్మతులకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటికొరత వున్న ప్రాంతాలను గుర్తించి ప్రత్యేకంగా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్ పాల్గొన్నారు.

పవిత్ర వారం.. శిలువతో పాదయాత్ర

ప్రత్తిపాడు: పవిత్ర వారంలో శిలువతో విశ్వాసులు పాదయాత్ర చేపట్టారు. ప్రత్తిపాడు మండలం రావిపాటివారిపాలెం (చినకోండ్రుపాడు) అమలోద్భవి మాత దేవాలయం నుంచి వట్టిచెరుకూరు మండలం కుర్నూతలలోని ఆరోగ్యమాత దేవాలయం వరకు విశ్వాసులు అధిక సంఖ్యలో పాదయాత్ర చేశారు. ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని విశ్వాసులు 40 రోజుల పాటు ఉపవాస దినాలు చేస్తారు. పవిత్రవారం కావడంతో విచారణ గురువులు బాసాని దినేష్, తమనంపల్లి సంతోష్‌లు ప్రత్యేక ప్రార్థనలు చేసి పాదయాత్రను ప్రారంభించారు. పాదయాత్ర పొడవునా విశ్వాసులు, క్రైస్తవులు క్రీస్తు శిలువను మోస్తూ, ఏసు గేయాలను ఆలపిస్తూ పాదయాత్ర చేశారు. ఆరోగ్యమాత దేవాలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు తీర్చుకుని, కానుకలు సమర్పించుకున్నారు.

యువ పారిశ్రామికవేత్తలకు వీఐటీ ఏపీ అండ

వీఐటీ – ఏపీలో ఘనంగా జాతీయ స్థాయి వ్యాపార ప్రణాళిక – గ్రాండ్ ఫైనల్ అవార్డు వేడుకలు



విద్యార్థులకు అవార్డులు అందజేస్తున్న వీసీ, అధ్యాపకులు

తాడికొండ: యువ పారిశ్రామిక వేత్తలకు వీఐటీ–ఏపీ విశ్వవిద్యాలయం ఆర్థికంగా, సాంకేతికంగా మద్దతు అందిస్తుందని వీఐటీ ఏపీ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఎస్వీ కోటారెడ్డి అన్నారు. ఐనవోలు వీఐటీ – ఏపీలో నిర్వహించిన 3వ వార్షిక జాతీయస్థాయి వ్యాపార ప్రణాళిక పోటీ, గ్రాండ్ ఫైనల్, అవార్డు వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వీఐటీ– ఏపీ స్కూల్ ఆఫ్ బిజినెస్ మరియు ఇన్నోవేషన్ ఇంక్యుబేషన్ మరియు ఎంటర్‌ప్రెన్యూవర్‌షిప్ సెల్ సంయుక్త సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యువ పారిశ్రామిక వేత్తలకు పేటెంట్ ప్రచురణలు, పరిశోధనా ర్యాంకింగ్‌లలో తమ విశ్వ విద్యాలయం సాధించిన విజయాలు వివరించారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి మాట్లాడుతూ పారిశ్రామికవేత్తల ప్రయాణంలో ఆవిష్కరణల ఆవశ్యకతను తెలియజేసి ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు వైఫల్యాలతో నిరుత్సాహపడకుండా వాటి నుంచి నేర్చుకోవాలని సూచించారు. టీఐఈ విశాఖ ప్రెసిడెంట్, ఎ హబ్ సీఈఓ రవి ఈశ్వరపు మాట్లాడుతూ వ్యవస్థాపక ప్రయాణం చాలా సవాలుతో కూడుకున్నదని, సొంత కుటుంబం నుంచి కూడా చాలా ప్రతిఘటనను ఎదుర్కోవాల్సి ఉంటుందని, అయితే సవాళ్లు ఉన్నప్పటికీ విజయవంతం కావాలంటే వ్యవస్థాపకతపై మక్కువ కలిగి ఉండాలన్నారు. వాధ్వాని ఫౌండేషన్ ప్రిన్సిపాల్ ఎంటర్‌ప్రెన్యూర్ ఎడ్యుకేషన్ డాక్టర్ ఆర్.సుజాత మాట్లాడుతూ వాధ్వాని ఫౌండేషన్ 19 దేశాలలో యువ పారిశ్రామికవేత్తలకు మూలధన వ్యయం మరియు శిక్షణా కార్యక్రమాల ద్వారా అందిస్తున్న సహకారం గురించి మాట్లాడారు. విద్యార్థుల్లో వ్యవస్థాపక స్ఫూర్తిని పెంపొందించడంలో వీఐటీ ఏపీ వర్సిటీ కృషిని వీఐటీ – టీబీఐ డైరెక్టర్ డాక్టర్ ఎ.బాలచంద్రన్ అభినందించారు. ఈ పోటీలలో దేశంలోని ఐఐటీలు, ట్రిపుల్ ఐటీలు, ఐఐఎంలు, ఎన్ఐటీలు మరియు ఇతర ప్రతిష్టాత్మక సంస్థలతో సహా 72 వర్సిటీలకు చెందిన 850 జట్లు పాల్గొన్నాయి. ఇన్నోవేషన్ ఇన్ టెక్నాలజీ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, హెల్త్‌కేర్ అండ్ అగ్రికల్చరల్ అడ్వాన్స్‌మెంట్‌లు, డిజిటల్ మరియు ఎన్విరాన్‌మెంటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అనే ప్రధాన అంశాలలో నిర్వహించిన ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన జట్లకు రూ.3 లక్షల విలువైన బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఐఈసీ డైరెక్టర్ డాక్టర్ అమీత్ చవా, వి–లాంచ్ పాడ్–2024 కన్వీనర్ డాక్టర్ ఉషా శేషాద్రి, విఐటీ– ఏపీ స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్‌లు డాక్టర్ అరుణ్ కుమార్, శివకుమార్ పలువురు విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ముగిసిన మనోహర పండుగలు



ఫిరంగిపురం: మండలంలోని గరుడాచల పాలెంలో క్రైస్తవ ఆరాధన మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న సువార్త సభలు (మనోహర పండుగలు) మంగళవారంతో ముగిశాయి. క్రీస్తు పరిచారకులు పలువురు వాక్యోపదేశం చేశారు. మార్నింగ్‌స్టార్ కళాశాల నిర్వాహకులు ఫాదర్ ఎం.బాలస్వామి వాక్యోపదేశం చేస్తూ ప్రతి ఒక్కరూ ప్రేమపూరిత మార్గంలో పయనించాలని చెప్పారు. క్రీస్తునందలి విశ్వాసం ప్రతి ఒక్కరిని ముందుకు బలమైన మార్గంగా నడిపిస్తుందన్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్స్ నెహెమ్యా, సునీల్‌కుమార్, దియ్యాప్రసాద్, కె.జాన్‌బాబులు పాల్గొన్నారు.

బెజ్జం సాయిప్రసాద్‌కు అభినందనలు

తాడికొండ: బెజ్జం సాయిప్రసాద్‌ను వైఎస్సార్ సీపీ మండల సేవాదళ్ అధ్యక్షుడిగా నియమించడం హర్షణీయమని తాడికొండ, నిడుముక్కల గ్రామ సర్పంచ్‌లు తోకల సరోజినీ, మాదాసు రత్నకుమారి, తుళ్ళూరు మండల ముఖ్య నాయకులు కొప్పుల శేషగిరిరావు అన్నారు. తాడికొండ మండల సేవాదళ్ అధ్యక్షుడుగా బెజ్జం సాయిప్రసాద్ నియామకం జరిగిన నేపథ్యంలో ఆయన్ను ఘనంగా సత్కరించారు. కరోనా కష్టకాలంలో వందలాది మంది పేదలకు నిత్యావసరాలు, సరుకులు, బియ్యం పంపిణీ చేసిన ఆయనకు తగిన పదవి ఇచ్చి సముచిత స్థానం కల్పించారని కొనియాడారు. ఈ సందర్భంగా బెజ్జం సాయిప్రసాద్‌ను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు కొప్పుల ఆంద్రేయప్ప, డీజే శ్రీను, కొదమల బుజ్జి పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫోర్టిఫైడ్ బియ్యాన్ని అందరూ వినియోగించాలి

ఎఫ్‌సీఐ తాడేపల్లి డిపో మేనేజర్లు వర్గీస్, ధనుంజయ్



తాడేపల్లిరూరల్: అధిక పోషక విలువలు కలిగి వున్న ఫోర్టిఫైడ్ బియ్యాన్ని అందరూ వినియోగించాలని ఎఫ్‌సీఐ తాడేపల్లి డిపో మేనేజర్లు వర్గీస్, ధనుంజయ్ అన్నారు. మంగళవారం ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి అంజిరెడ్డి కాలనీలో అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు ఫోర్టిఫైడ్ బియ్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మేనేజర్ క్యూసి రాంప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ రక్తహీనతను పోగొట్టే ఫోర్టిఫైడ్ బియ్యాన్ని సివిల్ సప్లయీస్ ద్వారా ప్రజలకు సరఫరా చేస్తున్నామని అన్నారు. ఫోర్టిఫైడ్ బియ్యంలో ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి12 వంటి విటమిన్లు పుష్కలంగా లభిస్తాయని వివరించారు. బియ్యాన్ని కడిగినప్పుడు వచ్చే నీటిలో అనేక పోషకాలు ఉంటాయని తెలిపారు. తాడేపల్లి ఎఫ్‌సీఐ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

కలెవరంలో రెండో రోజు ఎన్నికల ప్రచారం



కరపత్రాన్ని అందజేస్తున్న జెడ్పీటీసీ ఉమాప్రణతి, ఎమ్మెల్యే కుమారుడు సత్యనారాయణ

తెనాలిటౌన్: రూరల్ మండలం కలెవరం గ్రామంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తనయుడు సత్యనారాయణ నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారం మంగళవారం రెండో రోజు జరిగింది. పార్టీ నాయకులతో కలసి ఇంటింటికి తిరిగి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో పార్లమెంటు అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్‌లను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారానికి విశేష స్పందన లభించింది. ప్రచారంలో జెడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమాప్రణతి, ఎంపీటీసీ సభ్యులు మైలా భానుప్రసాద్, మాజీ సర్పంచ్ గంపల శివనాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు సంకురు బుజ్జిబాబు, గ్రామ ఉపసర్పంచ్ షేక్ బాబు సాహెబ్, మండల పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు పినపాటి అనిల్‌కుమార్, పెదరావూరు ఎంపీటీసీ రావూరి ఏసుదాసు, పార్టీ గ్రామ కన్వీనర్ తమ్మా శివారెడ్డి, పంచాయతీ వార్డు సభ్యులు బొనిగల సునీత, కొత్తపల్లి సుదర్శన్, ముక్కాల మహేష్, పార్టీ నాయకులు మంచాల శ్రీనివాసరావు, ఎల్.చిన్నిబాబు, బొనిగల సురేష్, షేక్ ఆదాం షఫీ, తుల్లిమిల్లి సువర్ణబాబు, పూసపాటి సురేష్ వర్మ, ఆర్.శ్రీనివాసరెడ్డి, నారంరాజు నాగరాజు, బాలరాజు దశరథ, రాయలచెరువు అశోక్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు



స్వామివారికి చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు



స్వామివారికి హారతి ఇస్తున్న అర్చక స్వామి

తెనాలిటౌన్: పట్టణ చెంచుపేట అమరావతి కాలనీలోని గోదా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 13 నుంచి జరుగుతున్న స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఆలయంలో ఉదయం నిత్య హోమం, మహాపూర్ణాహుతి, వసంతోత్సవం జరిపారు. స్వామి వారికి చక్రస్నానం చేయించారు. విశేష పూజలు జరిపారు. అనంతరం భక్తులకు అన్న సంతర్పణ చేశారు. ఆలయంలో సాయంత్రం పుష్పయాగం, ద్వాదశ ఆరాధన, ఆశీర్వచనం జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించండి

మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక



మహిళకు కరపత్రాన్ని పంపిణీ చేసి ఓట్లు అభ్యర్థిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కౌన్సిలర్ సుజాత

తెనాలిఅర్బన్: మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక కోరారు. పట్టణంలోని 13వ వార్డులోని వాసు కొట్టు నుంచి మంగళవారం సాయంత్రం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధిని తెలియజేసి కరపత్రాలు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీని వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కుర్రా సుజాత, గుంటూరు కోటేశ్వరరావు, కో–ఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభానీ, వైఎస్సార్‌సీపీ నాయకులు కుర్రా శ్రీను, యలవర్తి సాంబశివరావు, కఠారి హరీష్, చుక్కా ఆనంద్, గోల్డ్ రెహమా, పల్లె శామ్యూల్, కుక్కల ముక్తేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్యల బ్రహ్మోత్సవాలు



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కోటేశ్వరరావు

తెనాలిఅర్బన్: రామలింగేశ్వరపేటలో వేంచేసియున్న లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్యస్వామి వారి బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. వారం రోజుల నుంచి దేవస్థానంలో విశేషమైన పూజలు, యాగాలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు విశేష అర్చనలు నిర్వహించారు. మంగళవారం మధ్యాహ్నం దాతల సహకారంతో సుమారు రెండు వేల మందికి అన్నసంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు, న్యాయవాది హరిదాసు గౌరిశంకర్, మామిడిబత్తుల సుబ్రమణ్యం, కొండూరు శివయ్య, కాళిదాసు ప్రభుదాసు, మట్టుపల్లి గోపాల్, పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన సాయినాథ ఆలయ వార్షికోత్సవం

ఫిరంగిపురం: మండలకేంద్రంలోని సాలన బస్టాండు సెంటర్‌లోని షిర్డీ సాయినాథ ఆలయ 22వ వార్షికోత్సవం మంగళవారంతో ముగిసింది. ఉదయాన్నే వేద పండితులు నారాయణం ప్రసాదాచార్యులు, వంశీకృష్ణ, కె.రాఘవేంద్రశర్మలు స్వామికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. విశేష అర్చనలు, పూజలు నిర్వహించారు. భక్తుల స్వహస్తాలతో ఉత్సవమూర్తికి అభిషేకాలు నిర్వహించేలా ఏర్పాటుచేశారు.

ప్రజాస్వామ్యం కల్పించిన హక్కు 'ఓటు'



మానవహారంగా ఏర్పడి నినాదాలు చేస్తున్న వివిధ శాఖల ఉద్యోగులు

ప్రత్తిపాడు: ప్రజాస్వామ్యం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఎంపీడీవో కె. దుర్గాప్రసాద్ అన్నారు. నైతిక విలువలతో కూడిన ఓటింగ్ వైపు పయనించేలా ఓటర్లను చైతన్య పరిచేందుకు మంగళవారం పలు కార్యక్రమాలను నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం స్థానిక కార్యాలయం నుంచి అంకమ్మగుడి మీదుగా పాతమల్లాయపాలెం సెంటరు వరకు ర్యాలీ నిర్వహించారు. తదనంతరం మానవహారంగా ఏర్పడి ఓటు ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం సురేష్, ఆర్ఐ సాహితి, ఈవోపీఆర్డీ మోషె, కార్యదర్శులు నాగిరెడ్డి, జాన్‌పీరా, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

నా క్లయింటు గుంటూరు జిల్లా తెనాలి మండలం, కొలకలూరు గ్రామ డోర్ నెం. 9 28 రు వాస్తవ్యులు చాట్రగడ్డ వాసుదేవ ప్రసాద్ గారి భార్య చాట్రగడ్డ సులోచనాదేవి గారికి, కఠెవరం గ్రామములో తెనాలి యస్.ఆర్.ఓ.లో దస్తావేజు నెం.154/1965 సంబంధించి ఒరిజినల్ డాక్యుమెంట్స్ ది.19–3–2024న కొలకలూరు నుండి తెనాలి జిరాక్స్ నిమిత్తం వెళ్ళుచుండగా మార్గమధ్యలో పోయినవి. ఎంత వెతికినను దొరికలేదు. దొరికినవారు పై క్రింది అడ్రసులో సంప్రదించవలెను.
కాంటాక్ట్ సెల్: 7032545866